# అంతర్యం

'ఏవండీ.... మనం ఈ ఇల్లు మారిపోదామండీ ఇక్కడ ఒక్క క్షణం కూడా ఉండద్దు!"

ఆఫీసునించి ఇంటికి రాగానే కాఫీకప్పు చేతికి అందిస్తూ ఒక బాణం వేసింది రాజ్యం

అందులో అంతరార్ధం నాకు అర్ధంకాలేదు.

'ఈ ఇంటికి ఏమొచ్చిందోయ్ ? అద్దెఇల్లయినా అపురూపమైనదీ. ఇంటివారిపోరు ఇసుమంతలేదాయె, అడుగడుగునావచ్చి అద్దెపెంచబోరు'— కొంచెం హాస్యధోరణిలోనే అన్నాను.

'మీ కవిత్వం కట్టిపెట్టండి.... అసలు బాబిగాడు మనకి పుట్టాడా? వాళ్ళకి పుట్టాడా ?.... ఆ విషయం చెప్పండిముందు !'— తీవ్రంగా అడిగింది.

తాగుతున్న కాఫీ గుటకపడక, గొంతులోనే ఆగిపోయింది. వింతగాచూశాను రాజ్యంవైపు.

'క్షణం కూడా బాబిగాడితో ఆడుకోనివ్వకుండా ఇరవైనాలుగ్గంటలూ వాణ్ణి వాళ్ళే కట్టిపారేస్తున్నారు. వాళ్ళచేసేగారంతో, చివరికి— వాడు ఎంత పాడైపోతాడోనని భయంగా కూడా వుంది !'

'అసలేం జరిగిందోయ్ ?'

'పొద్దున్న మీరలా ఆఫీసుకి వెళ్ళగానే బాబిగాడికి జ్వరం తగిలింది. డాక్టరుకి చూపించాను.... అజీర్ణం చేసి వచ్చిందన్నారు !'— చెప్పింది రాజ్యం.

'అలాగా ! ఇప్పుడెలావుంది ?' ఆత్రంగా అడిగాను.

'ఏమో.... ఎలావుందో ?.... కన్నతల్లిని, నన్ను చూడనిస్తేగా ఆమహాతల్లి ? .... మూడేళ్ళయినా నిండని పసివెధవకి అన్నేసి బిస్కెట్లూ అవీపెడితే ఏమవుతుందీ ? అసలు పిల్లలంటే అంతముచ్చటపడిపోయేవాళ్లు ఏ అనాథ శరణాలయంనించో ఓ పిల్లాణ్ణి తెచ్చిపెంచుకోవాలి!'— ఆవేశంగా అంటోంది.

సరిగ్గా అదేక్షణంలో గుమ్మం దగ్గర ప్రత్యక్షమయ్యాడు విశ్వ నాథం. రాజ్యం 'మూకుడు మాటలు' విన్నాడేమోనని సిగ్గుపడ్డాను.

విశ్వనాథం గబగబా లోపలకు వచ్చాడు.... వాడి భుజం మీద బాబు నిద్రపోతున్నాడు.

'బాబుని ఛిల్డ్రిన్స్ స్పెషలిస్టుకి చూపించి తీసుకొచ్చాన్రా.... ఇంజక్షన్ ఇచ్చారు. రాత్రికి తగ్గిపోతుందన్నారు.' అంటూ వాణ్ణి రాజ్యానికి అందించాడు. జేబులోంచి ఓ చిన్నపొట్లం తీసి నాచేతిలో పెడుతూ అన్నాడు—

'ఇందులో సాయిబాబాగారి విభూది వుంది.... బాబుకి పెట్టండి. నేను ఆంజనేయస్వామి గుడికివెళ్ళి కొబ్బరికాయ కొట్టొస్తాను!'

హడావిడిగా వెళ్ళిపోతూ అంతలోనే గుమ్మం దగ్గర ఆగి—

'అన్నట్టు చెల్లెమ్మా! వాడిక్కాస్త దిష్టితీసి పారెయ్.... ఇందాకా ఆస్పత్రికి వెళ్ళినప్పుడు నలుగురికళ్ళూపడ్డాయ్!'— అన్నాడు.

ఆరాత్రి బాబిగాడి జ్వరం తగ్గిందోలేదో కనుక్కొనేందుకు రెండు సార్లు మా ఇంట్లోకొచ్చి మా నిద్రపాడుచేశాడు విశ్వనాథం.

'కన్నవాళ్ళం మనకిలేనిశ్రద్ధ ఆయనకు ఎక్కువైపోయింది'— అంటూ విసుక్కుంది రాజ్యం.

విశ్వనాథంతో నా స్నేహం ఇవాల్టిదీ, నిన్నటిదికాదు.... చిన్నప్పుడు, నేను నిడదవోలులో ఉన్నప్పుడు ఏడేళ్ళపాటు— వాడూ నేనూ కలసి బోర్డు హైస్కూల్లో చదువుకున్నాం. వాళ్ళింట్లోనే మేం అద్దె కుండేవాళ్ళం.... వాళ్ళ నాన్నగారు అక్కడకు దగ్గరలో ఏదో

పంచదార ఫ్యాక్టరీలో పనిచేసేవారు. అందుకని వాళ్ళకి పంచదార ఫ్రీగా వచ్చేది.వాళ్ళింట్లో ఎప్పుడూ స్వీట్లుఎక్కువతయారుచేసుకునేవారు. అస్తమానం స్వీట్లు తినడంవల్లనేకాబోలు, వాళ్ళింట్లో అందరూ తియ్యగా మాట్లాడేవారు. ఎప్పుడూస్వచ్ఛంగా నవ్వుతూ హేపీగాకనిపించేవారు....

నేనూ, విశ్వనాథం, శేషగిరీ అన్నదమ్ముల్లా కలసిమెలసి తిరిగే వాళ్ళం. విశ్వనాథం తమ్ముడే శేషగిరి.... రాజమండ్రీ వెళ్ళిసినిమా చూడాలంటేమేం ముగ్గురం కలిసివెళ్ళాల్సిందే!.... మా ఊళ్లో కాలవ కట్టేసినప్పుడు చెలమల్లో నీళ్ళుతోడుకురావటానికి ముగ్గురం కలిసేవెళ్ళేవాళ్ళం.... అదంతా చిన్నతనం.... అప్పటి మధురమైన సంఘటనలన్నీ తీపి జ్ఞాపకాలుగా మిగిలిపోవాల్సిందేతప్ప ఈ జన్మకి మరి అనుభవంలోకి రానివి....

కాలేజీ చదువు పూర్తికాగానే రాజ్యంతో పెళ్ళికావటం, హైదరాబాదులో ఉద్యోగం రావటం- ఒకటి తర్వాత ఒకటిగా— వరసగా జరిగిపోయాయి. నేను హైదరాబాద్ వచ్చిన రెండేళ్ళకే విశ్వనాథం కూడా హైదరాబాద్ వచ్చేశాడు.... ఒక ప్రయివేట్ కంపెనీలో ఛార్టర్డ్ ఎకౌంటెంట్‌గా ఉద్యోగం వచ్చింది వాడికి....

మా స్నేహం మరింత బలపడింది.... ఒక ఇంట్లోనే చెరోవాటా అద్దెకు తీసుకున్నాం.... విశ్వనాథం భార్య పార్వతి.... 'సొంత లాభం కొంతమానుకుని పొరుగువాడికి సాయపడవోయ్' అనే సూక్తిని ఆవిడ చదివిందో లేదో తెలీదుకానీ— పరోపకారమంటే ఎప్పుడూ పదడుగులు ముందే వుంటుందావిడ....

విశ్వనాథం సంగతిసరేసరి.... ఆవీధిలోఎవరింట్లో ఏకష్టమొచ్చినా రెక్కలు కట్టుకుని వాలతాడు. రెక్కలు ముక్కలయ్యేలా చాకిరీచేసి పెడతాడు.

అంతటి సహృదయంవున్న ఆ దంపతుల్ని భగవంతుడుఓవిధంగా చిన్న చూపే చూశాడు.... పెళ్ళయి పదేళ్ళయినా వాళ్ళకింకా పిల్లలు కలుగలేదు. అందుకే మా బాబిగాణ్ణి వాళ్ళు అ త్యమానం చేరదీస్తారు. ఎంతోగారం చేస్తారు.... విశ్వనాథం ఆఫీసునించి రాగానే బాబిగాణ్ణి ఎత్తుకుని షికారు తీసుకెడతాడు. రకరకాల డ్రస్సులూ రంగురంగుల బొమ్మలూ కొనిపెడతాడు.

'ఎందుకురా అవన్నీకొని డబ్బువృధా చేస్తావ్?'— అని అడిగితే, పట్టించుకోకుండా చిన్నగా నవ్వేసి ఊరుకుంటాడు.

ఒకసారి విశ్వనాథంతో రాజ్యం కూడా అంది—

'బాబిగాడ్ని మీరు మరీ గారం చేసేస్తున్నారు అన్నయ్యగారూ! వాడికోసం మీరు అనవసరంగా బోలెడంత ఖర్చుచేయటం మాకేం బాగా లేదు!'— అని.

'నిజమేనమ్మా.... కన్నవాళ్ళుగా మీరలా భావించటంలో తప్పు లేదు..కానీ. నేనేంపరాయివాడ్నికాదుగా! ఏజన్మలోనో పిల్లల్ని ద్వేషించి వుంటాను. అందుకే ఈ జన్మలో మాకు పిల్లలే లేకుండాపోయారు.... బాబిగాణ్ణిచూసి ఆబాధ మరచిపోతున్నామమ్మా!. ఇంక ఖర్చంటావా?.... ఉన్నదాంట్లోనే, నా ఆనందం కోసం ఎప్పుడైనా ఖర్చుపెడుతున్నాను తప్ప— వాడివల్ల నేనేమీ అప్పులపాలైపోనుకదా?'— అంటూనే బాబిగాణ్ణి తీసుకుని వెళ్ళిపోయాడు.

పార్వతి మాత్రం తక్కువ చేస్తుందా?....

పొద్దున్న మజ్జిగచిలికివెన్నతీసి— దాన్నిబాబిగాడిచేతబలవంతంగా తినిపిస్తుంది.... రాత్రి పూట గోరుముద్దలుపెట్టి భుజంపై వేసుకుని లాలి పాడుతూ నిద్రపుచ్చుతుంది....

బాబిగాడిమీద అంతటి ప్రేమను పెంచుకున్న వాళ్ళిద్దర్నీ— నేను ఏమనగలను ?....

అయినా పిల్లలు పుట్టింతర్వాత రోగాలు రాకుండాపోతాయా ?.... కాస్తంత జ్వరం తగిలితే— అందుకుకారణం వాళ్ళు చేసిన గారమేనని ఆడిపోసుకోవటం ఏం న్యాయం ?....

అమాటే చెప్పి రాజ్యాన్ని శాంతపరచటానికి ప్రయత్నించాను....

*          *          *

ఆరోజు మధ్యాన్నం మా మేనేజింగ్ డైరక్టర్ నన్నుపిలిచి— 'నువ్వు అర్జంటుగా కలకత్తా వెళ్ళాలోయ్' అన్నారు.

ఆమాట వినగానే నాలో ఉత్సాహం కలిగింది.

మొదటిసారిగా కలకత్తానగరాన్ని చూడగలుగుతానన్న సంతోషం కొంత- చాలాకాలం తర్వాత మళ్ళీ శేషగిరిని కలుసుకోగలుగుతాననే ఆనందం మరికొంతా— నన్ను కాసేపు ఉక్కిరిబిక్కిరిచేశాయి.

మాకంపెనీకిసంబంధించిన బ్రాంచిఒకటికలకత్తాలోవుంది. సాధారణంగా ఏ అవసరం వచ్చినా మా మేనేజింగ్ డైరక్టరే అక్కడకు విడుతుంటారు తప్ప— మాలాంటి చిన్న ఉద్యోగస్తులకి ఆ ఛాన్స్ ఇవ్వరు.

కలకత్తా బ్రాంచి ఆఫీసులో నేను చూడవలసిన పనేమిటో చెప్పి— రాత్రే బయల్దేరివెళ్ళమని అప్పటికప్పుడు అడ్వాన్స్ కూడా ఇచ్చారు.

హుషారుగా ఇంటికొచ్చి రాజ్యానికి విషయం చెప్పాను.

'నేనూ వస్తానండీ!'— అంది రాజ్యం క్షణం కూడా ఆలస్యం చేయకుండా. 'నువ్వా?'— నా ఉత్సాహానికి చిన్న బ్రేకుపడింది.

'ఏంరాకూడదా? అక్కడ ఎన్నో చూడవలసినవి వున్నాయట.... ఆమధ్య పార్వతి చెప్పింది. ఎలాగా మీరు ఆఫీసు పనిమీదే వెడుతున్నారాయె.... నా టిక్కట్టుకి రానూపోనూ మహా అయితే రెండు వందలవుతాయి.... బాబిగాడికి టిక్కట్టులేనే లేదు.... అక్కడ మీ శేషగిరి వుండనేవున్నాడు.. ఎంచక్కా దగ్గరుండి అన్నీ చూపిస్తాడు.'—

రాజ్యం చెప్పింది సమంజసంగానే తోచింది పనిగట్టుకునికలకత్తా వెళ్ళవలసిన అవసరంగానీ, వెళ్ళే అవకాశంగానీ,— ముందుముందు ఎలాగా రాకపోవచ్చు.... 'పేరిగాడి పెళ్ళిలో వీరిగాడికో 'జందెంపోచ' అన్నట్టు— ఇప్పుడొచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుంటే రాజ్యం ముచ్చట కూడా తీరిపోతుంది.

'సరే.... కానియ్! సూట్ కేసులో రెండేసి జతల బట్టలు సర్దేయ్ తొమ్మిదింటికే ట్రైను.!'— అంటూ మంచం కిందనున్న సూట్ కేసును బయటకు తీశాను.

'ఏమిట్రా హడావిడి?.... ఎక్కడికైనా ప్రయాణమా?'— లోపలకు వస్తూ అడిగాడు విశ్వనాథం.

మా కలకత్తా ప్రయాణం గురించి చెప్పాను.

'మళ్ళీ ఎప్పుడు తిరిగి రావటం?'— కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

'మహా అయితే ఒక వారం!'

'వీణ్ణికూడా తీసుకెడుతున్నారా?'— అప్పుడే అక్కడకువచ్చిన బాబిగాణ్ణిదగ్గరకు తీసుకుంటూ అడిగాడు.

'నువ్వడిగేది మరీ బావుందిరా విస్సూ! మేంఇద్దరం వెడుతూ, బాబిగాణ్ణి వదిలేస్తామా?.... వాడికి టిక్కెట్టు ఎలాగా కొనక్కర్లేదుకదా!

నా జవాబు వాడికి రుచించలేదు.

'అది నిజమేలే! కానీ బాబిగాణ్ణి చూడందే నాకసలు తోచదురా.... వాణ్ణి వదిలేసి వెళ్ళకూడదూ?.... మేం చూస్తాం కదా?' అర్థింపు ధ్వనించింది వాడి మాటల్లో.

నేనెక్కడ మెత్తబడి ఒప్పేసుకుంటానోనన్న భయంతో వెంటనే రాజ్యం కలుగచేసుకుంది—

'భలేవారండీఅన్నయ్యగారూ....ఆమాటకొస్తే మాకంటేఎక్కువ మీదగ్గరే వాడికి చనువు.... కానీ వాణ్ణి ఇక్కడ వదిలేసి వెడితే మాకు తోచదు. మా ప్రాణాలన్నీ ఇక్కడే వుంటాయి....'— అంది.

విశ్వనాథం మాట్లాడలేదు.... దిగులుగా కూర్చుండిపోయాడు.

'శేషగిరి అడ్రస్ కావాలిరా! కలకత్తాలో మకాం వాడింట్లోనే వేస్తాం!'- విశ్వనాథం మూడ్ మార్చే ధోరణిలో అన్నాను.

నామాట వినగానే తుళ్ళిపడ్డాడు విశ్వనాథం.

'వద్దురా....శేషగిరి ఇంటికి వెళ్ళొద్దు!'—ఛివాల్న కుర్చీలోంచిలేచి నిలబడ్డాడు.

ఈసారి త్రుళ్ళిపడటం నా వంతైంది!

శేషగిరి విశ్వనాదానికి స్వయాన తమ్ముడు.... అన్నదమ్ముల మధ్య వున్న ఆపేక్షా అనురాగాలు ఎలాంటివో నాకు బాగా తెలుసు.... అదేం శాపమో— పెళ్ళి చేసుకుని ఆరేళ్ళయినా— పాపం శేషగిరి కూడా పిల్లలకు నోచుకోలేదు.... ఎవర్నో ఒకఅనాధను తెచ్చి పెంచుకునె ప్రయత్నంలో వున్నట్టు ఆ మధ్య ఎప్పుడో ఉత్తరం రాశాడు.

రెండునెలలక్రితమే విశ్వనాధం, పార్వతీ కలకత్తా వెళ్ళివచ్చారు. అప్పుడు బాబిగాడి అందచందాల గురించీ, వాడు చేసే అల్లరి గురించీ విశ్వనాధం- శేషగిరికి చెప్పాడట.

ఆ విషయమే శేషగిరి నాకు ఉత్తరంలో రాస్తూ—

'ఒరేయ్ రాముడూ!....మీ బాబు గురించి మా విశ్వు చెప్పాడురా!- నాకేమనిపించిందో తెలుసా? అలాంటి అపురూపమైన సంతతిని పొందాలంటే ఎన్నో జన్మల పుణ్యం చేసుకుని వుండాలనిపించింది. రోజూ మీ బాబుతో ఆడుకుంటున్న మా విశ్వుని చూస్తే జెలసీగా కూడా వుంది!'— అన్నాడు.

శేషగిరినించి ఎప్పుడు వుత్తరం వచ్చినా, అందులోని విశేషాలు పూసగుచ్చినట్టు నాకు చెప్తాడు విశ్వనాధం... ప్రతి వుత్తరంలోనూ మాయోగక్షేమాలు కూడా అడుగుతూ వుంటాడు.

ఆమధ్య ఉద్యోగంలో తనకేదో ప్రమోషన్ వచ్చినట్టు రాశాడు శేషగిరి. అది చూసి ఎంతో సంబర పడిపోయాడు విశ్వనాధం...

అలాంటిది నేనిప్పుడు కలకత్తా వెడుతూంటే- శేషగిరి ఇంటికి వెళ్ళమనిచెప్పి తనంతట తానుగా అడ్రస్ ఇవ్వవలసిందిపోయి- విశ్వనాధం ఎందుకలా మాట్లాడుతున్నాడో అర్థంకాలేదు.

ఎన్నోఏళ్ళ తర్వాత మళ్ళీ శేషగిరిని కలుసుకునే అవకాశం దొరుకుతోందని ఉత్సాహపడ్డాను... ఇప్పుడు విశ్వనాథం అడ్రస్ ఇవ్వక పోతే ఎలా?... అయినా వాడు ఏ ఆఫీసులో పనిచేస్తున్నదీ నాకు తెలుసు... అక్కడికి వెళ్ళి కలుసుకుంటే వాడే మమ్మల్ని తన ఇంటికి తీసుకెడతాడు.

'ఒరేయ్। ఈ ఫ్రెండు మీద ఏమాత్రం గౌరవంవున్నా, నువ్వు వాణ్ణి కలుసుకోటానికి వీల్లేదు...' మళ్ళీ అన్నాడు విశ్వనాథం, నా ఆలోచనలు గ్రహించినట్టుగా.

'శేషగిరి మాత్రం నా ఫ్రెండు కాదా?'— అడిగాను,

'కావచ్చు! కానీ నాకు రక్తం పంచుకు పుట్టిన తమ్ముడు!.... అయినాసరే నువ్వువాణ్ణి కలుసుకోటానికి వీల్లేదు... అంతే! కలుసు కుంటే నా మీద ఒట్టే!'— చాలా సీరియస్‌గా అన్నాడు.

వాడి కళ్ళల్లో కనిపించే భావాలు చదవాలని ప్రయత్నించాను... కానీ అందుకు అవకాశం ఇవ్వకుండా గబగబా అక్కణ్నించి వెళ్ళి పోయాడు.

విశ్వనాథం ప్రవర్తన చాలా వింతగా తోచింది.!

శేషగిరిని ఎందుకు కలుసుకోవద్దంటున్నాడు?... అన్నదమ్ముల మధ్య ఏమైనా స్పర్ధలువచ్చాయా? వస్తే మాత్రం నన్నుకలవద్దని ఎందుకనాలీ?...

అన్నీ జవాబు దొరకని ప్రశ్నలే మిగిలిపోయాయి...

ఆ రాత్రి బండికే మేం బయల్దేరాం! .. రైలు ఎక్కించటానికి కాకపోయినా మేం వెళ్ళేముందు కనీసం వీధి గుమ్మంవరకైనా విశ్వనాథం వస్తాడనుకున్నాను... రాలేదు.

ఆ మర్నాడు కలకత్తా చేరుకోగానే మా కంపెనీ బ్రాంచికి ఫోన్ చేశాను. వాళ్ళే వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రెండో రోజునే ఆఫీసుపని పూర్తయిపోయింది. ఆ తర్వాత రెండు రోజుల్లో అక్కడ చూడవలసినవన్నీ చూసేసి— ఆరోనాటికల్లా ఇంటికి తిరిగివచ్చాం...

తలుపుతాళం తీస్తూండగానే విశ్వనాథం వచ్చాడు. బాబిగాణ్ణి ఎత్తేసుకుని ముద్దులు పెట్టేసుకున్నాడు.

'బాబిగాడు ఇలా చిక్కిపోయాడేమిట్రా ?'— అన్నాడు మాతోనే లోపలకు వస్తూ.

ఏం సమాధానం చెప్పాలి ? వాడి కళ్ళకు అలా చిక్కినట్టు కనిపించాడేమో మరి !

'అబ్బ!... ఈవారం రోజులూ, నాకూ పార్వతీకీ పిచ్చెత్తిపోయిందనుకో'— మళ్ళీ అన్నాడు.

'వచ్చేశారా ! అనుకున్నాను ఇవాళ వచ్చేస్తారనీ... పొద్దున్నించీ కాకి తెగ అరుస్తోంది. రాత్రి బాబిగాడు కలలోకి కూడా వచ్చాడు'— అంటూనే హడావిడిగా వచ్చింది పార్వతి.

పొద్దున్నించీ కాకి అరవటానికీ— మా ఇంటికి మేం తిరిగి రావటానికీ గల సంబంధం ఏమిటో నాకు బోధపడలేదు.

రాజ్యంకూడా పార్వతివైపు అసహనంగా చూసింది. అయినా ఆ చూపులోని భావాలు వాళ్ళకి అర్ధమైతేగా?... వాళ్ళధోరణి వాళ్ళదే! 'రారా బాబిగా.... వేణ్ణీళ్ళు రెడీగా వున్నాయి.... గబగబా పోసేసుకుని, గబగబా పాలు తాగేద్దువుగాని'— అంటూ విశ్వనాధం దగ్గరున్న బాబుని తీసుకుని, ఎంత హడావిడిగా వచ్చిందో, అంత హడావిడిగాను వెళ్ళి పోయింది.

వెళ్ళేముందు గుమ్మంలో నిలబడి—

"అన్నట్టు రాజమ్మొదినోయ్.... కాఫీ నేను చేసి తెస్తాను....నువ్ ఆ ప్రయత్నంచేయకు!'— అంది.

'ఏరా, శేషగిరి ఇంటిగ్గాని వెళ్లావా?''— ఒక నిమిషం తర్వాత నెమ్మదిగా అడిగాడు విశ్వనాధం.

'ఎలా వెడతానూ? వెళ్ళద్దని నువ్ ఒట్టుపెట్టుకున్నావ్‌గా!'— కొంచెం కోపంగానే చెప్పాను.

విశ్వనాధం కళ్ళల్లో సంతృప్తి కనిపించింది..... నాకు మాత్రం కోపం ఆగిందికాదు.

'అయినా, నన్నిలా కట్టేయటం ఏం బాగాలేదురా!.... ఇన్నేళ్ళ తర్వాత శేషగిరిని చూడగలుగుతానని ఎంతో ముచ్చటపడ్డాను.... నా ఉత్సాహాన్ని— కోరికనీ చంపేశావ్.... తిరిగివచ్చేస్తూంటే— శేషగిరిని

చూడలేకపోయానే అని ఎంత బాధపడ్డానో తెలుసా ?'— ఆవేశంగా అడిగాను.

'చూస్తే ఇంకా బాధపడేవాడివిరా !— అన్నాడు ముఖం పక్కకు తిప్పుకుని.

'అంటే.... ?'

'నీకు తెలీదురా రాముడూ !.... నీకంటే ఎక్కువ నేనూ బాధ పడ్డాను !'

'అసలు నన్నెందుకు వెళ్ళద్దన్నావ్ ?'— తీవ్రంగా అడిగాను. వాడు చెప్పే జవాబుకోసం రాజ్యం కూడా ఆసక్తిగా చూసింది.

'మేం ఇద్దరం దురదృష్టవంతులంరా.... అందుకే మాకు పిల్లలే కలగలేదు !'— గొణుక్కుంటున్నట్టుగా అన్నాడు.

వాణ్ణి చూస్తూ వుండిపోయాను.

మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాడు విశ్వనాధం—

'శేషగిరికూడా పిల్లలంటే ఎంతో ప్రేమ. బాబిగాడి గురించి ఆమధ్య చెప్పినపుడు వాడెంత పొంగి పోయాడో తెలుసా ?.... ఇప్పుడు బాబిగాడితో నువ్వు వాళ్ళింటికి వెళ్ళివుంటే- మిమ్మల్ని ఇంత త్వరగా తిరిగి పంపించేవాడు కూడా కాదు.... ఆపై క్షణం కూడా బాబిగాణ్ణి వదలివుండే వాడూ కాదు !'

'అయితే ?'

'నీకు తెలీదురా... ఆ స్తమానం బాబిగాణ్ణి వాడు అలా ఎత్తుకుంటే చెప్పటం ఆపి తల వంచుకున్నాడు విశ్వనాథం.

'అందులో తప్పేమిట్రా ?.... పిల్లలు లేనివాళ్ళు ఎవరైనాసరే–పిల్లలు కనిపిస్తే అంతగానూ ముచ్చట పడతారు.... నువ్వు మాత్రం ? ఆ స్తమానం బాబిగాణ్ని దగ్గరకు తీసుకోవటంలేదూ ?'- అడిగేను.

'అదికాదురా .... నీకు తెలీదు.... శేషగిరికి 'లెప్రసీ' ఎటాకయింది....' నా కళ్ళల్లోకి చూస్తూ చెప్పాడు....

'కుష్ఠువ్యాధా ?.... శేషగిరికి కుష్ఠువ్యాధా ?'– అదిరిపడ్డాను. అప్రయత్నంగా రాజ్యం వైపు చూశాను....

విశ్వనాథం ఆంతర్యం ఏమిటో- ఆక్షణాన అర్థంచేసుకోగలిగిన రాజ్యం కళ్లు చెమ్మగిల్లుతున్నాయి.

ఇంకా ఏదో అడగాలని ఆత్రంగా అటు తిరిగాను.

అప్పటికే విశ్వనాథం గుమ్మం దాటుతున్నాడు !

ఆంధ్రప్రభ
30-4-80